# లీడర్

కార్మిక

పొద్దు బారెడెక్కింది, కడుపులు ఈడ్చుకు పోతుంటే వాడిపోయిన మొకాలతో ఎవరికోసమో ఎదిరి చూస్తాండ్లు జెండగద్దె మీద కూర్చున్నమంది. రంగెల్సిపోయిన సుత్తె కొడవలి జెండా ఇనుపరాడుకు వేలాడుతోంది.

"అన్నా ఓ బీడుంటె ఇయ్యి" ప్రక్కనే నిలబడ్డ రాజయ్యను బీడి అడిగిండు చెంద్రయ్య. రాజయ్య ఓ బీడి తీసిచ్చిండు.

"పదకొండు గొట్టబట్టె ఇంకెప్పుడ త్తడో ఏమో, రాంగ కూడు గూడ తినిరాక ఆకలైతాంది. సింగలంత చాయన్నా తాగత్తాం పా" అంటూ అక్కడ కూర్చున్న మరో ఇద్దరు లేచి పోయిండ్లు.

"చూసి చూసి యాస్టరాబట్టె" ఇవ్వాల వత్తడంటవా?" బీడి అంటించుకుంటూ అడిగిండు రాజయ్య.

"ఇవ్వాల శనివారం గదాఅందుకే ఆలశ్యమైనట్లున్నది పూజగిట్ట చేసుకొని వత్తాండుగావచ్చు సారు" మొకంమీది చమటను తూడ్చుకుంటూ చెప్పిండుచెంద్రయ్య.

"కమినిష్టోల్లకు దోపిడెక్కడిది, పూజలెక్కడివి ఏంపనుండి ఆగిండో ఏమో" రాజయ్య.

"అగో! అయితే గా నెలరోజులకింద తిరుపతికిపోయి గుండు ఎందుకు కొట్టిచ్చుకచ్చుకున్నడు" ఎత్తుపండ్లు ఎల్లబెట్టి లింగయ్య ప్రశ్నించాడు. కాని ఆ ప్రశ్నకు జవాబు రాకముందే కారత్తాంది-కారత్తాందని అందరు లేచి నిలుసున్నరు.

సమస్తె సార్ అని కొందరంటే, దండం దొరా అని కొందరన్నరు. చేతులు మాత్రమే జోడించిండ్లు ఇంకొందరు.

కార్లనుండి సుతారంగా దిగిండు లీడరు. ఒక చేతిలో కాగితాల పుస్తకం, మరో చేతితో కండ్లద్దాలు పట్టుకొని చేయి లేపకుండానే సమస్తె, సమస్తె అంటు ఆఫీసు లోనికి నడిచిండు.

చేతిలోని కండ్లద్దాలు టేబుల్‌మీద ఉంచి కుర్చీలో కూలబడుతూ "మంచినీల్లు తేరా మొండిగా" అంటు ఆఫీసు బాయ్‌కి కేకేసి 'అబ్బబ్బ ఎండలు మాయిల్లమే ముదిరినయ్' అంటు మొకాన్ని తూడ్చుకున్నడు. అంతలోకే మొండోడు తెచ్చిన మంచినీల్లు గటగటతాగి గిలాసను మొండోని చేతికి తిరిగిచ్చి సిగరేటు వెలిగించిండు.

అప్పటిదాకా బయట నిలబడ్డ మంది లోనికచ్చి గోడనానుకుని ఉన్న బెంచి

మీద కొందరు కూర్చుంటే, స్థలం సరిపోక కొందరు నిలబడ్డారు. గోడకు ఒకవైపు లెనిన్ ఫొటోతోబాటు ఇంకో రెండు ఫొటోలు ఎవరివో వ్రేలాడుతున్నవి. పైన ఫ్యాను తిరుగుతోంది.

"ఏం సంగతి చెప్పండి? ఎందుకచ్చినట్లు?" సిగరేటు పొగ వదుల్తూ అడిగిండు లీడర్.

"దొరా! పని గురించి రూపాలిచ్చి మూడు నెల్లుగాబట్టె, ఇదివరకు నాలుగు సార్లు తిరిగిబోతి. ఇంతకుముందు వచ్చినప్పుడు 15 రోజుల తర్వాత కలుప మంటిరి గదా" - బెంచీపైన కూర్చున్న చెంద్రయ్య నిలబడి చెప్పిండు.

నేనిచ్చి నాలుగు నెల్లు అయితాందంటే, నేను తిరుగబట్టి ఆరు నెల్లయితాందని ఒకరు చెప్పడం కాకముందే ఇంకొకరు గొప్పున చెప్పుతున్నరు.

పైన ఫ్యాను తిరుగుతున్నా లీడర్ మొకానికి చెమటపట్టింది. ఆ మాటలు వింటూనే కుర్చీలో నుండి లేచి ప్రక్కనున్న బీరువానుండి కాగితాలకట్ట తీసి ఒక్కొక్కరి పేరు అడుగుతూ కాగితాలు తిరిగేసిండు.

యూనియన్ లీడర్ కాగితాలు వెదుకుతుంటే- పని దొరికినట్లేనని సంబర పడ్డరు కొందరు. ఇది మామూలే అనుకొన్నరు. ఆఫీసు చుట్టూ, లీడర్లచుట్టూ అనేక మార్లు తిరిగినవాల్లు.

ఆ కట్టలో వీరి పేర్లు దొరుకలేదో ఏమో,లేచి బీరువాలోనుండి మరొక ఫైలు బయటికితీసి అందులో నుండి రెండు-మూడు కాగితాలను బయటికి లాగి నింపాదిగా మరో సిగరేటును వెలిగించిండు.

ఫ్యానుగాలి చల్లగా వస్తున్నా-కడుపులో మాత్రం మంటమండుతుంటే సారేం చెప్పుతడో అని ఆశగా చూస్తాండ్లు అందరు.

"అవు రాజు మిమ్ములను రమ్మన్నది ఈరోజేనా" అడిగాడు లీడరు.

"ఈ రోజే రమ్మంటిరిగదా సార్" వెంకటి

"సారు కెందుకు యాదికుంటది మనగురించి. సారుకెన్ని పనులుంటయి ఏంకతా" రాజయ్య

"మీపనితప్ప నాకింకేంపని లేదనుకుంటాండ్లా" కోపాని కచ్చిన లీడరు సిగరేటు ముక్కను బయటికి విసరేసిండు విసురుగా

"మీరే చెప్పితిరి గదా- జీతాల తెల్లారి కలువుండ్లని" చెంద్రయ్య మల్లీ జ్ఞాపకం చేసిండు.

"అవునయ్యా నాకు తెలువదా- ఇవ్వాల మీర్ తర్తరని అందుకే మీ గురించి ఏజంటు ఆఫీసుకుపోయి మాట్లాడి వస్తున్నా" లీడర్.

"మరి ఏమైయింది సారు" అని రాజయ్య అడిగిండు.

"మీపేర్లు ఏజెంటు ఆఫీసుకు పోయినయి.కాని ఏజంటు దొర ఊరికి పోయిండట. ఇంకో వారం రోజుల వరకు రాడట. కాబట్టి మీరు ఇంకో పదిహేను రోజుల తర్వాత వస్తే ఏసంగతైన తెలుస్తది." అని చావు కబురు సల్లగా చెప్పిండు లీడరు.

అంతలోనే కండ్లలో ఊపిరితో కనుకయ్య మందిల నుంచి ముందు కచ్చిండు. "ఆరు నెల్లాయె నేను తిరుగ బట్టి రూపాయలు అప్పు తెచ్చినకాడ వడ్డీ పెరుగ బట్టే, పని దొరకకనో తిరుగుడు గాబట్టే, బండి చార్జీలకు తిప్పల కాబట్టే".

"అవునయ్యా పైసలు ఇచ్చేటప్పుడో కొసరి కొసరి ఇత్తరు. పని దొరుకుతలేదని ఎగిరిపడితే ఇదేమన్నా దుకాణం మీది సామానా- పైసలియ్యంగనే సామాను ఇయ్యడానికి"- కాగితాలు తిరిగి కట్టకడుతూ చెప్పిండు లీడర్.

"మనిషికి మూడు వేలకి త్తిమి, ఆర్నెల్లాయె తిరుగబట్టి- ఇక కొసరిందే ముంది, ఏగిరపడ్డదేముంది" అంటు కింద కూర్చొన్నోడు లేచి అన్నడు.

"అవునయ్యా నాకు మాత్రం తెలువదా. మీరిచ్చిన డబ్బు నేనేమన్న మింగుతాన్నా, నాకు మాత్రం బాదలేదా మీ గురించి. కంపినోల్లకు లంచం పెట్టుడేనాయె, ఎంప్లాయిమెంటు ఆఫీసుల లంచం లేంది పనే జరగదాయె. మన గురించి కంపినోల్లకేమన్నా బాదుంటదా. పనుల్లేక ఆకలికి బాదపడేటోల్ల గురించి కంపినీ దొరలకు కనికరముంటదా. అంతా లంచగొండి నాడ్డి కొడుకులే అయిరి. పైసలు తిన్నా పని తొందరగ చెయ్యరు. వీళ్ళ లంచగొండి తనాన్ని గురించి మొన్ననే కరపత్రాలు పంచినా వాళ్ళకు బుద్ధి రావడం లేదు. అందుకే గదా మేం చెప్పేది ఈ దొంగ కాంగ్రెసోల్లకు ఓట్లేసి గెలిపిస్తే దోపిడి గిట్లనే జరుగుద్ది. ఇవన్ని పోయి పేదోల్లకు న్యాయం జరుగాలంటే కమ్యూనిస్టు పార్టికి ఓట్లేసి గెలిపిస్తే పార్లమెంటుల దేనైన్నా మార్పించచ్చు. దోపిడి లంచగొండి తనాన్ని లేకుండా చెయ్యొచ్చు" లీడర్ ఇంకేదో చెప్పబోయేసరికి పట్ పట్ మంటు చప్పుడు చేసుకుంటూ ఆఫీసు ముందుకు సైకిల్ మోటార్ వచ్చి ఆగింది. మాటలు బందయి లీడర్‌తో బాటు అందరి దృష్టి మోటార్ సైకిల్ వైపు మళ్లింది.

మోటార్ సైకిల్ దిగి వచ్చిన గడ్డం మనిషి చలువ కళ్ళద్దాలు తీసి చేతిలో పట్టుకోనివచ్చి లీడర్‌తో హిందీ భాషలో ఏదో మాట్లాడిండు.

బయటెక్కడో కొంపలు తగులబడి పోయినట్లు- నాకు అర్జంటు పనుందంటు కాగితాల పుస్తకం పట్టుకొని కండ్లద్దాలు సవరించుకుంటూ వచ్చిన మనిషితోనే లీడరు బయటికి రావడంతోనే అందరు లేచి ఆఫీసు బయటికే వచ్చిండ్లు.

"మన సంగతేటు జెప్పకపాయెగదా. మల్లెప్పుడు రమ్మన్నట్టు అడుగుదాం పద" అంటు లీడర్ వెనుకాలే కారు దగ్గరికచ్చిండ్లు కొందరు.

"బాయికాడ స్ట్రయిక్ జరుగుతాందట నేను తొందరగా పోయేదున్నది. మీరు తర్వాత కలువుండ్లి"ని కారెక్కి కూర్చున్నడు లీడరు.

"మరి మా సంగతేమైనట్లు- మల్లెప్పుడు రావాల్నో చెప్పకపోతిరి" కారు చుట్టు ముూగిండ్లు మంది.

"పదిహేను రోజుల తర్వాత కంపినోల్లు మందిని బర్తీ చేసుకుంటాండ్లు. అప్పుడు మీరు సెలక్టు అయ్యేలా చేస్త కాబట్టి పదిహేను రోజుల తర్వాతచ్చి కల్సి పోండ్లంటు" కారు స్టార్టు చేసేసరికి కారు చుట్టూ గుమిగూడిన మంది పక్కకు జరిగిండ్లు. కారు దుమ్ము లేపుకుంటు ముందుకు దూసుకుపోగా- మొకాలపై పడ్డ దుమ్మును దులుపుకుంటూ ఇండ్లదారి పట్టిండ్లు.

○ ○ ○ ○

విశాలమైన ప్రహరిగోడ కలిగి మధ్యలో దాదాపు 30 గదులు గలిగిన పెద్ద ఆఫీసు బంగ్లా. బంగ్లా చుట్టు రకరకాల పూలచెట్లు. చెట్లకోసం నీటి సరఫరాకు నల్లాలు. పచ్చటి గడ్డీ, దొరల కార్లు, జీపులు నిలిపేందుకు షెడ్లు. ఆఫీసులో కొన్ని ఎయిర్‌కూల్ గదులైతే మిగిలినవి ఫ్యాన్లు మాత్రమే ఉన్నటువంటి గదులు. రెండు వరుసలుగా గదుల వరుసలు గలిగి మధ్యన వెడల్పయిన వరండా, వరండాలో హడావిడిగా తిరుగుతున్న ప్యూన్లు. ఆఫీసు ముందు భాగానగల గేట్ ద్వారంకు ఇరువైపులా పెద్దపెద్ద బోర్డులు వేలాడుతున్నయ్. ఒకదానిపై డివిజనల్ సూపర్‌రింటెండెంట్ అని వ్రాసివుంటే అడిషినల్ జనరల్ మేనేజర్ ఆఫీస అని ఇంకొక బోర్డుమీద వ్రాసి వుంది. గేటుముందు కాకి బట్టలేసుకుని కర్ర చేతబట్టుకున్న వాచ్‌మెన్ కాపలా కాస్తున్నడు.

ఆఫీసు ముందు ప్రహరి గోడనానుకుని బయటి స్థలంలో పెద్ద పెద్ద చెట్లు. గాచెట్ల నీడ క్రింద పొద్దున్నుండి ఎవరి కోసమో పడిగాపులుకాస్తు ఎదిరిచూస్తున్న దాదాపు ముప్పయి, నలుబై మంది గుంపులు గుంపులుగా చెట్లక్రింద కూర్చున్నారు.

రాలచెట్టు క్రింద కూర్చున్న లాగులోల్లు కొందరు రాజకీయాలు మాట్లాడుకుంటాండ్లు.

"కంపిన్ల పనిచేసేటోల్లకైతే వేజ్‌బోర్డు వచ్చినప్పుడల్లా జీతాలు పెరుగ వట్టె, జీతాలు పెరుగుతానయ్, పెరుగుతానయట అనుకోంగనే జీతాల కంటె ముందే బజార్ల ధరలు పెరుగవట్టె, జీతాలు పెరిగినా "ఎక్కడేసిన గొంగలి అక్కన్నే" ఉన్నట్లు మల్ల పైస గూడ మిగుల్త లేవుగదా-మరి జీతాలంటె కార్మికులకే పెరిగినయ్. మరి దరలో- దేశమంతట పెరిగెనా! గిసోంటప్పుడు జీతాలు పెరిగినోల్లకే ఎల్లకుంటుంటె ఏ జీతం పెరుగని ఊళ్ళల్ల కూలి, కైకిలి చేసుకోని బతికెటోళ్ళ సంగతేంది" కట్టెపుల్ల తోటి భూమి మీద గీతలు గీసుకుంట రాలచెట్టు కింద మందిల కూర్చున్న యాదగిరి అడిగిండు.

"అయితే కంపిండ్లల్ల పని చేసేటోల్లకు జీతాలు పెరుగుతాంటె దరలు పెరుగుకుంట కడుమోల్లకు తిప్పలైతాందంటవ్? మరి జీతాలు పెరగాల్నని లేబర్లు ఎందుకు సమ్మెలు చేస్తాండ్లంటవ్" యాదగిరికి ఎదురు ప్రశ్న వేసిండు సుధాకర్.

"దరలు పెరుగుతానయి గాబట్టి" జవాబు.

"జీతాలు పెంచుతే మల్ల దరలు పెర్గుతయిగదా" ప్రశ్న

"ఆ....అందుకే- పెంచవలసింది జీతాలను గాదు. ధరలను తగ్గించాలె. అంటే దోపిడి తగ్గాలె" జవాబు చెప్పిండు యాదగిరి.

మంచినీల్లు తాగేందుకు గేటుదాటి పూల తోటలో ఉన్న నల్ల దగ్గరకు పోయిన కొద్ది మందిని అధిరించుతూ బయటకు తరుము కస్తుండు వాచ్‌మెన్.

వేపచెట్టుక్రింద కూర్చొన్నోళ్ళు చిన్న చిన్న రాల్లుపెట్టి పులి-మేకలు ఆటను ఆడుతున్నారు.

మర్రిచెట్టు క్రింద కూర్చున్న గుంపులోల్లు వాళ్ళ వాళ్ళ బతుకుదెరువు సంగతులు, ఇంటి సంగతులు మాట్లాడు కొంటాండ్లు.

అప్పుడే ఓ నలుగురు గా మర్రిచెట్టు క్రిందికి వచ్చి నిలబడంగనే- అంత క్రితమే అక్కడ కూర్చున్న మంది అడిగిండ్లు.

"మీరు కూడ ట్రేనింగ్ అయినోల్లేనానే అన్నా"

"కాదు లాంగుటర్మినేషన్ చేసిండ్లు మమ్ములను "నలుగురిలో నుంచి ఓ వ్యక్తి చెప్పిండు.

"మీరు ట్రేనింగ్ అయినోల్లా?" అప్పుడే వచ్చిన నలుగురిలో నుండి ఒకతను ప్రశ్నించిండు.

528

"ఆ....లీడర్లకు లంచాలు పెట్టి పని గురించని ఆరునెల్లు కాల్లు అరిగేతట్టు

తిరిగినం. డాక్టరోడు ఫిట్ చేసెటాడ ఆడగూడ లంచం పెట్టినం. డాక్టర్ ఫిట్ అయినంక నెలరోజుల దాక తింపుకోని ట్రేనింగ్‌కు పంపిండ్లు. ట్రేనింగు అయ్యి మూడునెలలైతాంది ఇంత వరకు ఏబాయిలకు కూడ పంపుతలేరు. ఇవ్వాల రేపను కుంట మూడు నెలలు జరుగు కచ్చిండ్లు" పాటం చెప్పినట్లే చెప్పుకచ్చిండు మర్రి చెట్టు క్రింద కూర్చున్న మందిల నుండి ఒకతను.

"మరి ఇంకెప్పుడు తీసుకుంటరట"?

"ఏమో....పని కన్న పంపు మంటం, లేకుంటే మా రూపాలు మాకన్న సారేయి మంటం. ఈ రోజు లీడరోడు వచ్చినంక ఇటో అటో తేల్చుకోవాలె. నీయవ్వ గాడ్డి కొడుకులు పైసలు దొబ్బి ముడ్డిచుట్టు తిప్పుకొంటాండ్లు ఇంటికాగ కూలిచేసు కున్నట్లు గాదాయె. ఇక్కడ బాయిల పని దొరికినట్లు లేదాయె" బాధపడుతూ చెప్పిండు దోతి కట్టుకుని గుంపుల కూర్చున్నతను.

"పులి–మేకల ఆటలో నేను మూడుసార్లు పులులను కట్టేసిన" అంటూ విజయ గర్వంతో చెప్పుకుంట యాదగిరిదగ్గరకచ్చి కూర్చున్నడు రజాకు.

"చూడు సుధాకరన్నా దోపిడోల్లు ఓడిపోరంటివిగదా! మేకలు కట్టుగా వుండి ఆడెటోల్లు గట్టోలు అయితే తప్పకుండా పులులు కట్టుపడుతయి. మేకలు కట్టుగున్నా ఆడెటోల్లు తెలివి కల్లోలు గాకుంటే మేకలు ఓడుతయిగదా....అగో....గట్లనే మంది సంగతి, సర్కారు సంగతి కూడ. మంది కట్టుగుంటి నాయకులు మంచోల్లయితే ఎవ్వనైన్నా ఓడించచ్చు."

సుధాకర్ ఇంకేదో అడుగుదామనుకొనెటాల్లకే లీడర్ కారు వస్తాందని అందరు లేచిండ్లు.

దూరాన్నే చెట్టుక్రింద కారు ఆపుకొని దిగి వస్తున్న లీడర్‌కు ఎదురుగా ఎండ లోకే పోయిండ్లు చెట్లక్రింద కూర్చున్న మందందరు.

లీడర్‌కు ఎదురుగా పోయినోళ్ళు-లీడర్‌తోబాటు వెనక్కి తిరిగివచ్చి చెట్టు క్రింద జమయిండ్లు.

"ఏమయింది డి. ఓ. ఓ. సారేమన్నడు?" నడుచుకుంటనే అడిగిండు లీడరు.

"ఓసారు—ఇగమేం ఎవల్ని ఏం అడుగ దల్చుకోలేదు. మాపైసలు మాకియ్యండి. పనిలేకుంటె మాయె" ఎవలో కోపాని కచ్చి అడిగిండు.

"ఇంకెన్ని రోజులు చెట్లక్రింద కూర్చుండి పొమ్మంటరు. ఏమి తినుకుంట తిరుగు మంటాండ్లు" ఎవలకు తోచినట్లు వాల్లు ఎగబడ్డట్లు నిలదీసి అడిగిండ్లులీడర్‌ను.

"పనులల్లకు ఎక్కక ముందే గాడ్డి కొడుకులకింత గమండీ ఉంది ఇక రేపటి కాల బాయిల మీద నామాటే మింటరు వీల్లు". అని మనసులోనే అనుకొని మీగురించి గాకపోతే నేను ఎందుకు తిరుగుతాన్నను కొంటాండ్లు నేను డి. పి. ఓ. దగ్గరకు పోయి సంగతేందో తెల్సుకొని వత్తా'' అంటూ యుద్ధానికి బయలు దేరిన తీర్గ ఆఫీసు వైపుదారి తీసిండు లీడర్.

"ఈ మాటలు, ఈ ఇరుకులాట ఎప్పుడూ ఉండేదేనాయే. ఇయ్యాల తెల్సు కోనేదేంది లొట్ట పీసు" చెట్టు కింద మందిల నిలబడ్డ సాయిలు గునిగిండు.

కోపంతో బయలు దేరిన లీడర్‌కు ఆఫీసుమెట్లు ఎక్కేవరకే సగం కోపం చల్లబడ్డది.

డివిజనల్ సూపరెంటెండెంట్ అని బోర్డు వ్రాసివున్న గదిముందు నిలబడ్డ ప్యూను నమస్తె పెడుతూ డోర్‌ను తెరవడంతో లీడర్ ఆ గదిలోకి అడుగుపెడుతూ నమస్తే శాస్త్రిగారంటూ ఎదురుగా ఉన్న స్ప్రింగ్ కుర్చీవైపు దారితీసిండు.

ట్యూబ్‌లైట్ల కాంతిలో నున్నగామెరుస్తున్న బట్టతలను పైకెత్తి కళ్ళద్దాల కొసల్నుంచి పరీక్షగా చూస్తు "రండి స్వామిగారు రండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూయించిండు.

చూయించిన కుర్చిలో కుర్చుంటు స్వామిగారు, గది యొక్క ఎయిర్ కూల్డ్ వాతావరణానికి ఒక నిముషము మైమరచి కాస్త సేద తీర్చుకొని "ఏమండి శాస్త్రిగారు ఈ మధ్యనే మళ్ళీ లీవులో వెళ్ళుతున్నారంట ఏమిటి సంగతి" అంటు పిచ్చాపాటికి దిగాడు లీడరు

అంతలోకె సూపరిన్‌డెంట్ శాస్త్రిగారు ప్యూన్‌నుపిలిచి కూల్‌డ్రింక్స్ ఆర్డరిచ్చాడు.

"ఏముందండి మొన్న నాలుగు రోజులు మా పెద్దమ్మాయి వాళ్ళకు ఊటీకి ట్రాన్స్‌ఫర్ అయిందంటె చూసివస్తామని వెళ్ళానండి."

"అవునిక్కడ ఎండలు మండిపోతున్నాయండి అసలు ఈ ఎండలు తట్టు కునేటట్టుగా లేవు, మళ్ళీ మీ ప్రయాణము ఉందని విన్నాను. మళ్ళీ ఈ సారి ఎటు వెల్తున్నారు."

"చిన్నమ్మాయి పెళ్ళిసంబంధము గురించి విశాఖపట్నము పోవల్సిఉండె కాని ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ దొరకకపోవడంతో ప్రయాణం రద్దయింది. ప్యాసింజర్‌కు పోదామంటే ప్రయాణం లేటయితది. లేటే కాకుండా అందులో ప్రయాణము చేయ

530

లంటే ఇబ్బంది కూడ. బ్రైన్ కన్వీనెంట్ ఏమంతగా బాగా లేవండీ" సిగరెట్టు ముట్టించాడు శాస్త్రిగారు.

"ఆ ప్యాసింజర్ల పోయేదానికంటే నడిచిపోవడమే మేలు అందులో ప్రయాణం చేసేది మనుష్యులు కారండి పశువులు, అవునుగని అబ్బాయిగారు ఏం పని చేస్తున్నరు' తనో సిగిరెట్టు అంటించుకుంటు కుతూహలంగా అడిగిండు లీడరు.

షిప్‌యార్డులో ఇంజనీరుగా చేస్తున్నడు,కాని సమస్యఒకటి వచ్చిపడిందండి.... అదే కట్నం విషయంలో...." శాస్త్రిగారు కాస్త నీళ్ళు నమిలాడు.

'ఎంతేమిటి'

'లక్షయాబయివేలు'

'అబ్బా మాకంటే మీరెసయమండి'

'ఏదో నౌకరిగాల్లం అంత ఏం యిచ్చుకోగలమండి'

"మేరు అలాగే అంటారు....కానుస్నా కార్యము గంధర్వులే నిర్వహిస్తరు, మీరేమి బెంగపెట్టుకోకండి, పీపైతే యివ్వాలె మా సెక్రటరిని మీఇంటికి పంపిస్తా" లీడరామాట అని శాస్త్రిగారికేసి చూసిండు కళ్ళు పెద్దయి చేసుకుని.

"అందరి సహకారముండాలి .... అది సరెగాని 2 ఇంజెన్ సంగతేంటి నాకిదేమి అర్థము కావటములేదు, మాటిమాటికి స్ట్రయికులకు దిగుతారు....వీళ్ళు చేయబట్టే మొత్తం డివిజన్‌కే చెడ్డపేరొచ్చేట్టుంది." శాస్త్రిగారి మాటలినేసరికి లీడర్‌కు మత్తు వొదిలింది.

"మేము ఇదివరకె చెప్పితిమిగదా రాడికల్స్ చేయబట్టే ఆ బాయి సరిగా నడవదని"

'మీమ్ముల్ని కాదని సమ్మెలెట్లా జరుగుతాసయి' శాస్త్రిగారి రాజకీయం అర్థముకాలె.

"ఇదిగో శాస్త్రిగారు వాళ్ళను పనిలో ఉండనిచ్చినంతకాలం మేముకాదు కదా ఇంకెవరు వచ్చినా కార్మికులు వినరు....బాయింకా పూర్తిగా చెడిపోకముందే రాడికల్ పోరగాండ్లను పనినుండి డిస్మిస్ చేయండి ఆ తర్వాత బాయి అదే బాగుపడుద్ది" లీడర్ ఆవేశానికి వచ్చి చెప్పిండు.

ప్యూన్ లోనికొచ్చి కూల్‌డ్రింక్స్ యిచ్చిండు.

కూల్‌డ్రింక్స్‌తాగి నెమ్మదికొచ్చిండ్లు ఇద్దరు. లీడర్‌సామి మళ్ళీ అన్నడు

"ఇదివరకు మెడికల్ పిట్ అయిన వార్ని పనిగల్పించక పోతిరి....వాళ్ళు నాపీకలు పడుతున్నరు.... బయట చెట్లక్రింద కూచున్నరు లోనికి రావడమే కష్టమై పోతాంది ట్రైనింగ్ ఇచ్చి మూడు నెలలు కాబట్టె, ఇంత వరకు పనిలకు పంపించక పోతిరి"

"చూడండి స్వామిగారు అన్ని తెలిసి మీరె యిలా అంటే అటు అపాయింట్ మెంట్, ఇటు ట్రైనింగ్‌కు పంపడం ఇంకోవైపు పిట్‌లోకి పంపడము అన్ని ఒక్కసారి జరగాలంటే ఎలా?" ముందున్న ఫైలును తిరిగేస్తు చెప్పుకొచ్చిండు శాస్త్రి.

"అదికాదండి....యిప్పుడు రెండు వైపుల నుండి సమస్య ఎదురౌతాంది.... అటు డబ్బిచ్చినోళ్ళు పని గురించి ఎగిరపడబట్టిరి, ఇటు ట్రైనింగ్ చేసినోళ్ళు అగుత లేరు" స్వామి ఇబ్బంది పడుతు చెప్పిండు.

చేతిలో ఫైలును మళ్ళిమూసిండు....మెల్లగా చెవులో చెప్పినట్టు ముందుకు వంగి "ఇంకో పదిహేను రోజులు ఆగుకరాండి ఇప్పుడు ట్రైనింగ్ చెస్తున్న బ్యాచ్ అయిపోగానే కొత్తవాళ్ళను అపాయింట్ చేసుకొని ట్రైనింగ్‌కి పంపిస్తాము. ఇకపోతే ఇదివరకు లాంగ్ టర్మినెషన్ డిసమిస్ జరిగిన బాపతు వెకన్సిలున్నవి కదా.... మొన్నటి స్ట్రయిక్ బాపతు యింకొందరిని తీసెయవచ్చు.... ఇంత యిబ్బంది ఉండక పోను అపాయింట్‌మెంట్‌లో అవకతవకలని జనం గగ్గోలు పెడుతాండ్లు కాస్త గుట్టుగా జరిగేట్టు చూడాలి." మళ్ళో సిగరెట్టు అంటించిండు.

ఆఫీసర్‌గారి ప్లాన్‌కు లీడర్‌కు కొంచెము ఊరట కలిగింది. ప్యూన్‌తో చల్లటి నీళ్ళు తెప్పించుకొని గటగట త్రాగి గడియారం చూసుకున్నాడు 'సరె అలాగే కానీయండి....నేను బాయికాడికి పోయివస్తా' లీడరు లేచి బయిటకి నడిచిండు.

"సారు లోపటికి పోయి చాలసేపయితాంది కదా ఇంకేమి జేత్తాండో" చూసి వద్దామని లోపలికి పోనీకి ప్రయత్నించిండ్లు చెట్ల కింద ఉన్నమంది. కాని వాచ్‌మన్ వాళ్ళను గేటుదాటనియ్యలె.

"వాడికేం బాధ-కడుపునిండా మెక్కి వచ్చిండ్లు ఫ్యాన్లక్రింద కూర్చొని ఏం బాతఖాని గొడుతాండ్లో ఏమో?" టర్మినేషన్ చేయబడ్డ ఎంకటి అన్నడు.

'అగో! వత్తాండుగదా' అని ఎవరో అనెటప్పటికి అందరు లేచి ఒక కాడ జమయిండ్లు. మంది ఎల్లిపోయి ఉండవచ్చుననుకొన్న లీడర్‌కు గుంపును చూడగానే కలవరమెత్తింది. లేని కోపాన్ని తెచ్చుకొని 'చూడండి కామ్రేడ్స్ మంచి మాటలతోని మనకు పనులు జరిగేట్టు లేదు. ఇంతకాలం ఓపిక పట్టినం ఇక సహించేది లేదు. 'కడుపు కాలేవాని బాధ కక్కతినోనికేమెరుకన్నట్టు' ఇంతకాలము మంచిమాటతోనే చెప్పినా

మేనేజ్‌మెంట్ మనసుల కెక్కుతలేదు. కాబట్టి మేనేజ్‌మెంట్ మొండి వైఖరికి వ్యతిరేకంగా మనం పోరాటం జరుపాలె, అంతకు మించి వేరె మార్గము అగుపిస్త లేదు కాబట్టి కామ్రేడ్స్, ఎల్లుండి నుండి మెడికల్ ఫిట్ అయిన వాళ్ళ పనిలోకి తీసుకోవాలని ఈ ఆఫీసు ముందే నిరాహార దీక్ష బూనాలె మనం పోరాటం చేయాలె' ఆవేశంగా అని లీడర్ 'నేను తొందర పనిమీద బాయి మీదికి పోతున్నా మీరంత రేపు యూనియన్ ఆఫీసుకు వచ్చి కలువుండ్లని' చెప్పి కారెక్కి ప్రయాణమయిండు.

ం ం ం

జీతాలు చెల్లించే నాటికి ఒక రోజుముందు ఎప్పటి లాగే కార్మికులందరికి జీతాల వివరాలు తెలిపే చిటీలు ఎవరివి వాల్లకు పంచిండు క్లర్కు.

నెలంత కష్టపడి పనిచేసినందుకు రేపు తాము పొందబోయే జీతాల మొత్తాన్ని చూసుకోవటములో ఉబలాట పడుతుండ్లు కార్మికులు.

'నా జీతమెంతుందో చూడు, లాడీసులెన్ని ఏసిండ్లో? సిక్ లీవు బరాబరి కట్టిండా' ఇలాంటి వివరాలన్ని చదువురాని కార్మికులందరు తమ జీతపు చిట్టీలను చదువచ్చినోళ్ళకు చూపించుకొంటున్నరు.

కిరాణం దుకాణం కాతా, బట్టల దుకాణపువాడి అప్పు చిల్లర బాకీలు అన్ని కట్టుకొంగ ఈసారి గుడిసెను రిపేరు చేయాలను కున్నోల్లకు, జీతాలు దొరికినంక ఎక్కడివి అక్కడపోను ఇంటికిన్ని రూపాయలు పంపించాలను కున్నోళ్ళకు, ఈ నెలన్నా పోరగాండ్లకు బట్టలు కుట్టించాలను కున్నోల్లకు, ఇలా ఏవోవో వారి వారి అవసరాలను తీర్చుకోవాలని లెక్క లేసుకొని కుతూహలంగా ఉన్న కార్మికులకు వారి జీతాల చిట్టీలపై ఉన్న జీతం తెల్వంగనే ఒక్కసారిగా వాళ్ళ ఆశలు నిరాశలై పాలి పోయిన మొఖాలతో ఎవరికి వాళ్ళ గుసుస్తున్నరు.

జీతాల రోజు బాయికాడనే బాకీలోల్లు వసూల్ల కత్తరు ఎవలకు బొంకాలె, ఎవలకు పంచాలె ఈ జీతాన్ని అని లెక్కలు వేసుకుంటు; ఇంకెన్నడొత్తయో జీతా లని ఎదురు చూసిన వాళ్ళకు ఎందుకు వచ్చెరా ఇప్పుడె జీతాలని పగారు చిట్టి చూడంగనే బెంగటిల్లు తాండ్లు.

ఉన్నట్టుండి కార్మికులల్ల కలకలం బయలుదేరింది బదిలీ పిల్లరోల్లకు జీతం సరిగ కట్టక తక్కువ దొరికిందని 'నాకు తక్కువ కట్టిండ్లంటే' నాకు తక్కువ ఉన్నదంటు' ఇరువై మంది దాక బదిలీ పిల్లర్స్ కల్సి సంగతేందో తెల్సుకొని వస్తాం పదంటు ఆఫీసువైపు దారి తీసిండ్లుగా మందిలెవడో కంపినోల్ని తిడుతాండు.

అట్ల కదిలిన కార్మికులు పేషీటురైటర్‌ను అడిగిండ్లు జీతమెందుకు తక్కువొచ్చిందని దాంతో బదిలి పిల్లర్స్‌కు క్యాజువల్ లీవ్ కట్టలేదని తేలింది.

పర్మినెంటు లాడిస కార్మికులు, మిగితా క్యాటగిరి కార్మికులందరు పనుల్లోకి వెలుతుంటే, బదిలీ పిల్లర్ జమయి క్యాజువల్ లీవెందుకు కట్టలేదో పోయి మేనేజర్ను అడుగుతాం పదండి' దాంతో అందరు మేనేజరు దగ్గరకెళ్ళి అడుగుతే పర్మినెంట్ గాని వారికి క్యాజువల్ దొరకదని చెప్పిండు. దాంతో కార్మికులు నిరసన తెలుపుతు బదిలి పిల్లర్స్ అంతా పనులు బందుచేస్తూ ఇంటిదారి పట్టిండ్లు.

తిరిగి రెండవ షిప్టు, మూడవ షిప్టు బదిలీ పిల్లర్సు రెండవ రోజు బాయి మీద కార్మికులంత జమ కావడంతో బావి పరిసర ప్రాంతమంతా కార్మికులతో కిక్కిరిసి పోయింది.

కంపిని లారీమీద వచ్చిన పోలీసులు తుపాకులు పట్టుకొని, లాఠీలు ఊపుకుంటూ మర్రిచెట్టుకింద నిలబడ్డరు.

అంతవరకు గుంపులు గుంపులుగా చేరి చర్చించుకుంటున్న కార్మికులు లీడరు కారు రావడముతోనే కారుచుట్టు గుమిగూడిండ్లు.

లీడరు చుట్టు గుమికూడినోల్లు ఏం మాట్లాడుతున్నది దూరంగ నిలబడ్డోల్లకు అర్థమైతలేదు.

అక్కడక్కడ నిలబడ్డ కొందరికి అండర్ మేనేజర్లు, ఓవర్‌మెన్‌లు 'బాయి లకు దిగుండ్లని' నచ్చచెప్పుతున్నరు.

చుట్టు గుమికూడిన కార్మికుల నుద్దేశించి 'జీతాలు తక్కువ గడితే తర్వాత తిరిగి లెక్కలు చేయించి సరిచేయించక పోయినమా ? దగ్గుతే పత్తుతే స్ట్రయికేనా' లీడరు చికాకుగా అన్నడు.

"లెక్కలు తప్పేదెంది సార్ క్యాజువల్ లీవు బదిలి పిల్లర్సుకు కట్టరని మేనేజర్ చెప్పబట్టె, ఇంకేమి లెక్కలు చూత్తరు' టోపి సంకలపెట్టుకొన్న వీరాస్వామి మందిలనుంచే లీడర్ను అడిగిండు.

"లీవు ఉనోళ్ళకు ఇవ్వనసటానికి వాడెవడు మన ఎర్ర జండా యూనియన్ పోరాడి సాధించింది, ఈ క్యాజువల్ లీవు దొరకదు అనటానికి ఎవ్వనికి హక్కు లేదు, మేనెజరు అట్ల ఎట్ల అన్నడో పోయి కనుక్కొని వస్తా" అంటూనే మేనేజర్ గదివైపు కదిలిండు.

"తుపాకి రాముడొచ్చిండు....యింకేమి....పని అయినట్టె" ఎవడో [illegible]తంటాడు గొగ్గిళ్ళు ఎల్లబెట్టి.

534

యింకెవడో ఆఫీసునుండి బయటికి వచ్చినంక లీడరేమి చెపుతడో ముందె చెపుతాండు అనుభవం మీద.

మేనేజర్ గదిలోకి పోయిన లీడరు పావుగంటలోనే బయటికి వచ్చిండు—నవుకుంట. ఆఫీసు ముందున్న గద్దెమీది కొచ్చి 'కామ్రేడ్స్, వేజిబోర్డులో మేనేజిమెంటుకు మన యూనియన్‌కు జరిగిన ఒప్పందం ప్రకారము కార్మికులందరికి క్యాజువల్ లీవు రావాలె, కానింకా పై ఆఫీసునుంచి సర్క్యులర్సు రాలేదట. మేము మాత్రం లీవు అందరికి వర్తించాలని బల్లగుద్దినట్టు వాదించినం. ఆలస్యం పనికి రాదన్నం.... కంపినికి మన యూనియన్‌కు కొత్తగూడెంలో చర్చలు జరుగుతున్నయి రేపు వచ్చే వారంల మల్లి చర్చలున్నాయి.....ఇప్పుడు పర్మినెంటు వాళ్ళంతా లీవులు పెట్టుకోవచ్చు....సర్క్యులర్స్ వచ్చిన తరువాత బదిలీవోల్లకు ఎరియర్స్ కట్టిస్తరు.''

మాటల మధ్యలనె బదిలిపిల్లగాడు ఒకడు ''ఇంకా ఎన్నేల్లకు వస్తయి సార్ సర్క్యులర్సు. ఒప్పందమై ఏండ్లు గడిచినా యింకా వస్తనె ఉంటయా? అసలింతకు ఈ బదిలి పిల్లర్సును పర్మినెంటు చేసెదున్నదా లేదా? 190 హాజర్లు ఉంటే పర్మినెంటు చేయాలని ఖానూన్ల ఉందని చెప్పితిరి.....నేను మస్లకెక్కి మూడేండ్లాయే. మూన్నెల్లకోసారి టర్మినేషన్ ఆయె....యింక పర్మినెంటు ఎప్పుడు?''. బక్కపలచని, ఎర్రటి మొఖం జేవురించగా పొంగ అడిగిండు.

దాంతో అక్కడ పర్మనెంట్ కాని బదిలి పిల్లర్సుకు లీవు గురించి సాగుతున్న సమస్యకి కొత్త పర్మినెంటు సంగతి కూడ చేరింది.

అంతలోకె లబ్బ పెదవులోడు 'ఓ మిషన్ ఖాయం లేదు. స్పేర్ స్పేర్ అని అడ్డమైన పని జేయిస్తాండు, ముసలోల్ల మయ్యేదాక యింక పర్మినెంటే కాదా?'

''సర్వీసు దొరకదు, యాక్టింగ్‌కు తగ్గట్టు క్యాటగిరి కట్టియ్యరు. ఎల్.టి.సి. బాపతు పైసలు ఎగ్గొడుతాండ్లు'' ఆవేశంగా అంటాండు వీరాస్వామి.

సమస్య చేయిదాటి పోతుందని లీడరుకు కలవరం పుట్టింది. కార్మికుల్లో అలజడి ఎక్కువైంది. 'పర్మినెంటు చేసెదాక పనులకు పోయేదిలేదు' కొందరంటుంటే వెల్‌ఫేర్ ఆఫీసర్‌తో వాదులాడుతాండ్లు మరికొందరు.

కార్మికుల వ్యవహారం చూస్తుంటే లీడర్‌కు కోపమొచ్చింది. మనసులోనే తిట్టుకొని బయటికి మాత్రం ''మీ పర్మినెంట్ గురించి కన్సిలేషన్ల పెట్టినం. అందరికి పర్మినెంటు చేయించే బాధ్యత మాది''

అంధరి దృష్టి లీడర్‌వైపు మరిలింది.

535

"అన్నిటికి కన్సిలేషనే, కన్సిలేషన్ల జెట్టి ఇదివరకేమి సాధించి తెచ్చిండ్లు ఈ మూడు నాలుగేల్లనుండి మేము నష్టపోయింది సాదించు కొస్తావా" మందిలనుండి మాట్లాడిండెవడో.

'ఈ చదువుకున్న పొరగాండ్లు జాయిలపని చెయ్య చాతగాక చీటికి మాటికి సమ్మెలు చేపిస్తాండ్లు, కార్మికులసందరిని రెచ్చగొట్టు కుంటున్నరు. ఈ రాడికలోల్లు వచ్చి నాల్గురోజులైతలేదు. మా ఎఱ్ఱజెండా యూనియన్ నాయకత్వాన సాదించిన హక్కులు వీళ్ళకేమెరుక, మేం గూడ ఒకప్పుడు తుపాకి పట్టి పోరాడినం, నిన్న మొన్న కండ్లు తెరిచినోల్లకేమెరుక మా ఎఱ్ఱజెండా యూనియన్ గురించి పాత కార్మికుల నడుగుండ్లీ తెలుస్తది' అంటు 'ఏరి మా పాత కార్మికులంటు' వెనక్కి తిరిగిండు లీడరు.

'మా తాత నేతులు తాగిండ్లు మా మూతులు వాసన సూడుండ్లీ' అన్నడట ఎనకటికి ఎవడో, నువు ఎప్పుడేంజేసినవో మాకు మాగెరుకే బొక్కనోరు కొమురయ్య నుద్దేశించి 'ఓ పాత కార్మికుడా ఈయన మీకేమి సాదించి పెట్టిండో చెప్పరాదు.'

మందుగుటక డబ్బాలకాడ నిలుచున్న కోల్‌కట్టర్ కొమురయ్య 'అం మాజేసిండు. మాకు క్యాటగిరి పెంచుతామని చెప్పి మిషిన్‌కు అరుగురు పన్జేసేకాడ నల్గుర్ని చేసిండు మందు గుటుకలు పెంచిండ్లు, 4 ఫీట్ల మిషన్ రాడును అరు ఫీట్ల పొడువుకు పెంచిండ్లని' బొక్క నోట్లో ఉన్న పొగాకు ఉంచిండు తుపుక్కున.

వీరస్వామి మళ్ళి అందుకున్నాడు 'మాసిండ్లా లీడర్లు చేసిన ఘనవిజయం క్యాటగిరి పెంచి పిచ్చినమని ఆరుగురు చేసే పనిని నలుగురు చేసెటట్టుచేసి కంపనీ నికి ఇద్దరు కార్మికుల జీతాలు మిగిలెటట్టు చేసిండ్లు, దాంతోపాటు మందు గుటకలు మోసుడు పెరిగింది, అంటే వీల్లు సాధించిన ఘనవిజయం కార్మికుల కంటే కంపినికె లాభించింది. అట్లున్నయి వీల్ల పనులు'

లీడర్ కోపం తారస్థాయి నందుకుంది, కాని ఈ పరిస్థితిలో శాంతమే ఎంతో అవసరమనుకొని లేని శాంతాన్ని మొఖంలోకి తెచ్చుకొని 'మాశండి కామ్రేడ్స్ వీళ్ళు యువకులు ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ, కార్మికుల చేత సమ్మె చేపిస్తేనే కాదు, సమస్యను ఎట్లా పరిష్కరించాలో ఆలోచించరు. మేనేజ్‌మెంట్ అన్యాయం చేస్తలేదని నేను అనటం లేదు, అన్యాయాన్ని కట్టుగుండి మనమంత ఎదురించాలి. దేనికైనా ఓ పద్దతుంటది. ఖానూను ప్రకారం మనం కొట్లాడాలె, మన సమస్యలేమిటో వ్రాసి యిచ్చి ఒప్పుకొకపోతే సమ్మె చేస్తమని పద్నాల్గు రోజుల

ముందు సమ్మె నోటీస్ ఇవ్వాలె. మనం చేసె పద్ధతి ప్రకారం చేసినా కంపినోల్లు మొండిగానే ఉన్నరనుకో అప్పుడు తప్పకుండా చేయాల్సి ఉంటుంది. అన్ని అవకాశాలు చూసెనంక మనకున్న ఆఖరి ఆయుధము సమ్మె ఉండనే ఉన్నది." లీడరు కాస్త ముందుకు జరిగి వీరస్వామి బుజంమీద చేయ్యేసి చెప్పుకొచ్చిండు.

"నీయవ్వ దొంగలు పడ్డంక అర్నెల్లకు కుక్కలు మొరిగినయట.... ఆకరిది లేదు మొదటిదిలేదు, ఎప్పుడొచ్చినా రెండు అడుగులు వెనుకకే అనిరి, నోటీసు పెట్టినమనిరి, నువు నోటీసులిచ్చి సాదించి కొచ్చిందెన్నడు?....నోటీసులె ఇచ్చుకో నోట్లనే పెట్టుకో పాండ్లిర పాండ్లి" అంటు బక్క ఎంకులు ల్యాంపు రూమ్‌కేసి నడిచిండు.... మిగత కార్మికులంతా అతనెంట నడిచిండ్లు.

కార్మికులంతా అక్కడినుండి ఎల్లిపోయారని నిర్ధారించుకున్నంక 'చీఁ చీఁ దినం దినం లౌడీసాల్లు గొర్ల లెక్క తయారై తాండ్లుసారు, వాళ్ళకు ఒగలు చెప్పితె యినరు' లీడర్ మనిషి ఒకడు లీడరుతో అంటాండు.

"గిదానయ్య లీడర్ గిరంటే నాలుగు రోజుల కోసారి అయిందానికి కానిదానికి సమ్మెలు చేయించడం" ఎవరికి తోచినట్టు వాళ్ళు అంటాండ్లు లీడర్ చుట్టు జమయిన ట్రామర్లు టింబర్ మెన్‌లు.

'నా ఇరవై ఏండ్ల సర్వీసులో మరీ ఇంతటి మూర్ఖత్వాన్ని ఎన్నడు చూడ లేదండి' అంటు లీడరు దగ్గరికొచ్చిండు వెల్‌ఫేర్ అఫీసరు.

"వెనుకొచ్చిన కొమ్ములు ముందు పుట్టిన చెవులను ఎక్కిరించినట్లు...పిల్ల కాకి కేం యెరుక ఉండేలు దెబ్బ.... ఎంత గనము ఎగురుతరో ఎగరనియి అదిగూడ చూస్త" వెళ్ళిపోతున్న కార్మికులవైపు చూస్తు అక్కసుగా అంటుండు లీడరు.

'అఁ ఎంతదూరమండి తొంత పరుగు ఎనుగుల్దాకన్నట్టు మూడు రోజులైతే చచ్చినట్టు వాళ్ళె దిగుతరు' హెడ్ ఒవర్ మెన్ నర్సింహ మంటాడు.

గేటు బయిట కొందరు యువకులు పాటలు పాడుతూవుంటే గేటు దాటుతున్న కార్మికులందరు తిరిగి అక్కడ గుంపు గూడిండ్లు.

ఊరిదొరా బావిదొరా
లీడరోడు సర్కారోడు
దోసుకునే దొంగలంత
ఏడ ఉన్న ఒక్కటేను
దోపిడోల్ల రాజ్యమాయెరో ఓలాడిసన్నా
దోపిడోల్ల తోడురారురో ఓ కార్మికన్న

537

గా పాటలు వినరాంగనే లీడరు చుట్టు నిలబడివున్న మస్టర్ వర్కర్లందరు లాఠీసు కార్మికుల గుంపు దిక్కు దారితీసిండ్లు.

పాట పాడుతున్నాల్లు ఉన్నట్లుండి "కార్మికుల ఐక్యత" అని ఒక్కడు గట్టిగ అరువంగనే "వర్ధిల్లాలి" అని అందరన్నరు. 'బదిలీ పిల్లర్లందరిని-వెంటనే పర్మినెంటు చేయాలి' 'క్యాజువల్ లీవులు చెల్లించాలి' కార్మికుల గుంపు కదిలింది.

పోలీసోల్లు లారీ ఎక్కిండ్లు

మేనేజరు గదివైపు దారి తీసిండు లీడర్.

ం ం ం

మూడు రోజుల వరకు సమ్మెను కొనసాగించిన కార్మికులు ఇతర బావులకు సమ్మెను విస్తరింప చేయడానికి సిద్ధమైండ్లు.

మాటలు చెప్పి నమ్మించి సమ్మెను విరమింప చేయాలని ప్రయత్నించి విఫలమైన యూనియనోల్లు కొంతమందికి త్రాగించి దింపించేందుకు సిద్ధమైయిండు.

కల్లు బట్టీలో కల్లు పెట్టెలు ఖాళీ అయినయి. 'డెయించోత్ ఇవ్వాల ఎవ్వడాపుతడో సూత్తం సెకండ్ సిఫ్టుల బాయిని నడుపుదే.... సారుమీకెందుకు....మేం చెప్పుతానం గదా ఎవ్వలు దిగినా దిగకున్నా మా గ్యాంగులను దింపిత్తం' సొలుక్కుంట లీడరుకు మాటిచ్చి బాయివైపు నడిచిండ్లు.

కార్మికులలో లొల్లిపెరిగింది 'లంజ కొడుకులు ఎవడు దిగుతడో దిగనీ.... బైయించోత్ చెప్పుసులతో నరుకుతం' అని కోపంతో కొందరంటె 'బూట్లు మెడకేసి తిప్పుదామని' ఇంకొందరన్నరు.

కార్మికులలోల్లికి కల్లుదాగి నోల్లకు నిషదిగింది' నీ యవ్వ అందరు దిగుతే అందరితోబాటు నేను దిగుతానని ఎవరికి వాల్లు మనసులో అనుకున్నరు.

కల్లు నిషాతగ్గినా 'ఎవ్వడేం పీకు తడో సూత్తనంటు తట్టా చమ్మాసు బుజానేసుకొని బాయి వైపు నడిచిండు మొండిలింగయ్య.

వీడెంత దూరం పోతడో పోనీ అనుకున్నోల్లు నిజంగా బాయిలకు అడుగు పెట్టెసరికి ఓపిక నశించింది.

'గాడ్డి కొడుకును గుంజుకరాండ్లని' ఎవ్వలో మందిలనుంచి అనంగనే ఒక్కరెనుక అందరు ముందు కురికిండ్లు.

మందిని చూసిన లింగయ్య తట్ట చమ్మాసు పారేసి ఎనుగు దాటి ఉరుకదగిలిండు-కాని కార్మికులు విడిచిపెట్టలే. లింగయ్యను పట్టుకొని గేటువైపు గుంజుక

538

పోయిండ్లు. లింగయ్య ఎంత గింజులాడుకున్నా విడిచి పెట్టలేదు. అక్కడే ఎనుగు తేగకు కట్టిన పాక బూట్లదండ మెడల పడ్డది లింగయ్యకు.

బూట్లు మెడలేసిండ్లే తప్ప ఎవ్వలు కొట్టలేదు లింగయ్యకు ఈ శిక్ష సాలును కున్నరు. తిరిగి ఊరేగింపు బయలు దేరింది ఏజంట్ ఆఫీసువైపు.

ఏజంట్ ఆఫీసు ముందున్న చెట్ల క్రింద తడుకలుగట్టి పందిరేసి, నాలుగు దిక్కుల నాలుగు ఎర్రజెండలు కట్టి ఉన్నాయి. ముందు బాగా ఎర్రగుడ్డమీద "ట్రెయినింగ్ అయినవారికి వెంటనే పని కల్పించాలి" "A I T U C జిందాబాద్" అని తెల్లక్షరాలలో వ్రాసి కట్టి ఉన్నది. పందిరికింద కొందరు బొట్టు పెట్టుకొని మెడను దండలేసుకొని కూర్చున్నారు. ప్రక్క పొంట బెంచీమీద లీడర్‌తోపాటు ఇంకొంత మందికూర్చుని మాట్లాడుతాండ్లు.

ఊరేగింపు ఏజంట్ ఆఫీసువైపు మరలడంతో లీడరు అక్కడనుంచి లేచి ఆఫీసులోకి దారితీసెండు.

ఆఫీసు గేటుముందాగిన కార్మికులు ఆఫీసు దనించేలా నినాదాలు పలికిండ్లు.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి
మేనేజిమెంటు దౌర్జన్యం నశించాలి
బదిలీ పిల్లర్లను పర్మినెంటు చేయాలి
క్యాజువల్ లీవులు కట్టివ్వాలి
దొంగ లీడర్లు నశించాలి
పోరాడేవానిదే ఎర్ర జెండా

రాయమల్లు అంతలోనే పాటందుకున్నాడు—

పల్లెపల్లెన పోరుబాటలు ఎర్రనీ శ్రీకాకుళము
నాడు అక్కడ రగిలి రగిలి నేడు ఇక్కడ మండుతంది
పోరుబాటలో బోదామా బావయ్యో బంగారయో
ఎర్రతోవలో మనం బోదామా వీరుడో గని కార్మికా

గీపాటలు వినస్తాంటే తడకలక్రింద కూర్చొని నిరాహారదీక్ష పట్టినోల్లకు ఉంటబుద్ధికాక లేచి మందిల కచ్చిండ్లు.

ఏజంట్ ఆఫీసులున్న గుమస్తాలు బయటకి రాలేక కిటికీల్లనుంచె బయటికి చూస్తాండ్లు.

పోలీసోల్లు తుపాకులు పట్టుకొని గేటుకాడ నిలబడ్డరు. పాటలు బంద్ కాంగనే వీరాస్వామి మందిల నిలబడి ఉపన్యాస మిచ్చిండు.

వీరాస్వామి ఉపన్యాసమయిపోయినంక ఎన్ని రోజులైనా మంచిదే. బాయిల రోల్లకు చిలుం పట్టినా సమస్య తీరేదాక దిగేదిలేదని అనుకుంటు ఇండ్ల దారిపట్టిండ్లు కార్మికులు.

లోపల సూపరిన్‌టెండెంట్ గదిలో "మీరు చేయబట్టి వ్యవహారము ఎంత దూరం వచ్చిందో చూడండి" అన్నాడు లీడరు వికారంగ మొఖం పెట్టి.

"మేం చేసిందేముంది. ఏమైనా అడిషనల్ జనరల్ మేనేజర్ను కల్సి మాట్లాడుదాం పదండి" అటు సూపర్‌డెంట్ శాస్త్రి, లీడరు ఎ.జి.యం. రూములో కెళ్ళారు. వెళ్ళనోళ్ళు గంటవరకుగాని తిర్గిరాలేదు.

మరునాడు మొదటి షిఫ్టులో బావికాడ మూడు షిఫ్టుల కార్మికులు జమయిండ్లు. అంతలోనే వెల్‌ఫేర్ ఆపీసరు బొంగురు గొంతుకతోని మైకుల మాట్లాడుతాండు కార్మికుల నుద్దేశించి.

"ఇందు మూలంగా కార్మికులకు తెలియజేయునది ఏమనగా బదిలీ పిల్లర్లకు ఒక్కొక్కరికి '7' రోజుల క్యాజువల్ లీవు ఇచ్చేందుకు మేనేజిమెంటు వారు ఒప్పుకున్నారు. కాబట్టి కార్మికులందరు పనిలోకి పోవాలని మనవి చేస్తున్నాము." మళ్ళీ "ఇందుమూలంగా........అరిగిపోయిన రికార్డులా వెల్ఫేర్ ఆపీసరు మళ్ళీ మళ్ళీ చెప్పుతూనే ఉన్నాడు.

కార్మికులకు ఉత్సాహం వచ్చింది. మాటలు బందుజేసి ఇంటాండ్లు. 'కొందరంటాండ్లు, 'మరి బదిలీ పిల్లర్ల పర్మినెంటు సంగతేం తేలింది.'

"బదిలీ పిల్లర్ల పర్మినెంటు గురించి లిస్టు తయారైతాంది. రేపో మాపో అది కూడ అయితది." యూనియన్ల తిరిగె అలీ అన్నడు.

ఇంకేంది.... పొండ్లి పొండ్లి బాయిల ఓవర్‌మెన్ హెడ్ వచ్చి వర్క్‌డిస్ట్రిబ్యూషన్ చేసేందుకు తొందరపడుతు అన్నడు.

కార్మికులు పనుల్లోకి వెళ్లేందుకు నిశ్చయించుకొని బావివైపు కదిలిండ్లు. అంతలోకే లీడరు కారులో వచ్చి 'బావివైపు పోతున్న కార్మికుల ముందుకొచ్చి 'కామ్రేడ్స్ బదిలీ పిల్లర్లకు గూడ '7' రోజుల క్యాజువల్ లీవు ఇచ్చేందుకు మేనేజిమెంటును ఒప్పించినం.... పర్మినెంటు అయినంక అందరిలాగే పదకొండు రోజులు క్యాజువల్

540

లీవు దొరుకుద్ది. ఇకపోతే పర్మినెంటు గురించి నిన్ననే కన్సిలేషన్ పెట్టినం త్వరలోనె పర్మినెంటు లెటర్లు వస్తయి' విజయ గర్వంగా చెప్పుకొచ్చిండు లీడరు.

"వీన్నెవ్వడు పిల్చిండ్రా!"

"ఏమేమి వచ్చినయో మాకెరుకలేదా"

"ఎక్కడా నువు కొట్లాడింది" మంది మాట్లాడుతాండ్లు.

'నువ్వు బాయి మీదినుండి ఎల్లిపోతేనే మేం బాయిల దిగుతం' సన్నగడ్డపోడు లీడరు మొఖం మీదన్నడు.

'ఏయ్! ఏం మాట్లాడుతానవ్' లీడర్ గరాని కొచ్చిండు.

అంతలోకె వెల్ఫేర్ ఆఫీసరొచ్చి లీడర్‌ను సముదాయించి బయిటికి పంపిండు. కార్మికులు బావిలోకి దిగిండ్లు.

సమ్మె విరమణ జర్గి పదిహేను రోజులైంది.

ఆ రోజు మొదటి షిఫ్టులో డ్యూటికొచ్చిన వీరస్వామితో పాటు మరో యిద్దరికి బదిలీ ఫిల్లర్లకు వేలి ముద్రలేయించు కొని తలా ఒక్క లెటర్ చేతికిచ్చిండు మ్యాన్‌వే క్లర్క్. మిగితా రెండు షిఫ్టులల్ల నుండి కూడ నల్గురు బదిలీ ఫిల్లర్లకు కూడ అలాంటి లెటర్స్ ఇచ్చిండ్లు.

అందులో 'కార్మికులు సమ్మెలు చేయడం వలన ఉత్పత్తికి నష్టమొచ్చిందని. కార్మికులను రెచ్చగొట్టి చట్టవిరుద్ధమైన సమ్మెలు చేపించినందుకు గాను, సమ్మెకు మీరే కారకులంటు' వీరస్వామికి చార్జిషీటు మాత్రమే యిచ్చి మిగితా ఆర్గురు బదిలీ ఫిల్లర్స్‌కు లాంగ్ టర్మినేషన్ లెటర్ ఇవ్వడం జరిగింది.

o o o

కాళీ అయిన బదిలీ ఫిల్లర్స్ స్థానంలో నిరాహారదీక్ష బూనుతున్న వాళ్లకు పిలుపులొచ్చినయి.... లంచాలిచ్చినోల్లకు ఇంటర్వ్యూలొచ్చినయి.... యింటర్వ్యూ అయినోల్లకు డాక్టర్ ఫిట్‌కు పంపించిండ్లు.

అచ్చులో — సృజన ప్రచురణ

శివసాగర్
కవితా సంకలనం

ఉద్యమం నెలబాలుడు

గెరిల్లా - విప్లవ గీతాలు, జనం ఊపిరితో...., ఆ తర్వాతి కవితలు, ఇంటర్వ్యూలతో——

—వివరాలకు : సృజన, హనుమకొండ, 506 001.